# పోలింగ్‌కు సర్వం సిద్ధం..

- 292 పోలింగ్ కేంద్రాలు, 81 సమస్యాత్మక కేంద్రాలు, 5 మోడల్ పోలింగ్ కేంద్రాలు
- విధుల్లో 947 ఉద్యోగులు, 584 పోలీసు సిబ్బంది
- 27 రూట్లు, 120 బస్సులు
- భద్రత నడుమ ఈవీఎంలతో బస్సుల్లో చేరుకున్న సిబ్బంది
- ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్





సత్తుపల్లి: అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు సత్యేంద్ర సింగ్, పోలింగ్ కేంద్రాలకు తరలివెళుతున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఈవీఎంలతో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

సత్తుపల్లి, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం స్థానిక జ్యోతి నిలయంలో ఎన్నికల అధికారులకు ఎన్నికల సామగ్రిని రిటర్నింగ్ అధికారి అశోక చక్రవర్తి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మొత్తం 292 పోలింగ్ కేంద్రాలకు గాను పీవో, ఏపీవోలు 584 మంది, సెక్టార్ ఆఫీసర్లు 287 మంది, మైక్రో అబ్జర్వర్లు 56, వెబ్‌కాస్టింగ్ సిబ్బంది 20, 120 బస్సులు, 584 పోలీస్ సిబ్బందితో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించనున్నారు. మొత్తం 27 రూట్లుగా విభజించి బస్సుల ద్వారా ఎన్నికల సామగ్రి, సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలీసు బందోబస్తుతో అధికారులు తరలించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 81 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలానికి ఒకటి చొప్పున నియోజకవర్గ ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. దివ్యాంగులు, వృద్ధులకు పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు సత్యేంద్రసింగ్, శిక్షణా కలెక్టర్ మయాంక్ సింగ్ పరిశీలించారు.




సత్తుపల్లి: పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన అధికారులు, పోలీసు సిబ్బంది

**ఎన్నికలకు భారీ బందోబస్తు..**

ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీసీపీ కుమారస్వామి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఏసీపీ రామానుజం, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ చరియన్ రాజ్, ఉమేశ్, హిమాన్స్‌లతో కలిసి ఐదుగురు సీఐలు, 8 మంది ఎస్సైలతో పాటు మరో 500 మంది పారామిలటరీ, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు ఓటర్లను తప్ప ఎవరినీ అనుమతించమని ఏసీపీ తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ నిషేధమని, కేంద్రాల వద్ద రాజకీయ నాయకులు 100 మీటర్ల అవతలే ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో సైతం ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి**

వేంసూరు, నవంబర్ 29: గురువారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని 46 పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్, నోడల్ ఆఫీసర్ రాజు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీస్ సిబ్బంది, పీవోలు, ఏపీవోల పర్యవేక్షణతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**మండలంలో ఏర్పాట్లు పూర్తి**

తల్లాడ, నవంబర్ 29: మండలంలో సార్వత్రిక ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం జరగనున్న పోలింగ్‌కు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు. మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో 57 పోలింగ్ బూత్‌ల ద్వారా 44,959 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల సందర్భంగా అన్ని పోలింగ్‌బూత్‌లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పోలింగ్‌కు అవసరమైన విద్యుత్, మంచి నీటి సరఫరా, సీసీ కెమెరాలను అమర్చారు.





సత్తుపల్లి: జ్యోతి నిలయంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది, ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న రిటర్నింగ్ అధికారి, తల్లాడ: కుర్నవల్లిలో ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వస్తున్న సిబ్బంది

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందజేత



కుట్టుమిషన్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

సత్తుపల్లి టౌన్, నవంబర్ 29: లయన్స్ క్లబ్ బాధ్యులు దారా కృష్ణారావు, వందనపు మోహనరావు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. పట్టణానికి చెందిన నిరుపేద మహిళ తారుమూరి రమాదేవికి కుట్టుమిషన్, పిరమిడ్ ధ్యానకేంద్రానికి రెండు సిమెంటు బల్లలు, దొడ్డా కృష్ణయ్య, రమ దంపతుల ఆధ్వర్యంలో పోస్టాఫీసుకు సిమెంటు బల్లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌బాధ్యులు దొడ్డా కృష్ణయ్య, పెనుగొండ రమేశ్, గుండు శ్రీనివాసరావు, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, తోట రమేశ్, జంగా సత్యనారాయణ, రవి, కొత్తూరు సత్యనారాయణ, వేముల విశ్వనాథం, దారా సరస్వతి, దొడ్డా రమ, కృష్ణారావు, శేషగిరిరావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: సీఐ



పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు

టేకులపల్లి, నవంబర్ 29: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినయోగం చేసుకోవాలి, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ అమూల్యమైన ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం మండలం వ్యాప్తంగా ఉన్న 44 పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను సీఐ ఇంద్రసేనారెడ్డి, టేకులపల్లి, బోడు ఎస్సైలు గన్‌రెడ్డి రమణారెడ్డి, రంజిత్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రక్రియ చాలా కీలకమైందన్నారు. ప్రశాంత వాతావరణంలో జరిగే ఎన్నికలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఓటర్లు ఎవ్వరూ సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్ పోలింగ్ బూత్‌లోకి తీసుకువెళ్లకూడదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సెల్ఫీలు దిగడం నిషేదమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు కోసం పట్టణాల నుంచి పల్లెలకు



ప్రయాణికులతో కిక్కిరిసిన వీ.ఎం.బంజర బస్టాండ్

పెనుబల్లి, నవంబర్ 29: గురువారం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు మండలానికి చేరుకున్నారు. దీంతో మండలంలోని వీఎం బంజర బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసింది.